సాక్షి

పశ్చిమగోదావరి

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



హోరాహోరీగా..

మార్టేరులో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జట్లు సత్తాచాటాయి.

8లో ▸



బాబు హయాంలో..

చంద్రబాబుకు సంఘీభావంగా ప్రజలంతా కంచాలు కొడుతూ ప్రజాశబ్దం వినిపించా లంటూ లోకేశ్ ఇచ్చిన పిలుపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

8లో ▸



రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

ఏలూరులో ఆదివారం ఏపీ షాటోఖాన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకుడు ఇబ్రహీం తెలిపారు.

8లో ▸

న్యూస్‌రీల్

వరంగల్ జిల్లా జడ్జిగా ప్రసన్న



జడ్జి ప్రసన్నను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యురాలు బి.ప్రసన్న తెలంగాణలోని వరంగల్ జిల్లా కోర్టులో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా శనివారం పట్టణ బార్ అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆమెను సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ ప్రసన్న మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్ న్యాయవాదులు జి.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, ముత్తా రామారావు, డి.సూర్య రామారావు, మాకా శ్రీనివాసరావు, కె.కుసుమ హరినాథ్, తోట రాంబాబు, జీకే దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు పోటీతత్వంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మూడో దశ రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, బీహెచ్‌పీఎస్ డిస్ట్రిబ్యూషన్, రీ సర్వేలోని మ్యుటేషన్లు తిరస్కరణ, ఎన్నికలు, ఇనాం భూములు, అసైన్డ్ భూములు, సివిల్ సప్లయిస్, అడంగల్ కరెక్షన్లు, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు, స్థల సేకరణ, టూరిజం ప్రాజెక్ట్స్, స్పందన తదితర 18 అంశాలపై సమీక్షించారు. రీ సర్వేలో వ్యవసాయ భూములు, గ్రామకంఠం సర్వే సకాలంలో పూర్తిచేసి మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. రైతులకు సకాలంలో నోటీసులను అందజేయకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం ఎక్కడా వదలకుండా పక్కాగా సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రైవేట్ స్థలాలు సర్వే అనంతరం యజమానులకు యాజమాన్య హక్కు పత్రాలు సకాలంలో అందజేయాలని సూచించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, కలెక్టరేట్ ఏఓ వైకేవీ అప్పారావు, భూ సర్వే తహసీల్దార్ సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు 65 రోజులకు రూ.51,36,425 ఆదాయం లభించినట్టు సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. ఈఓ కర్రి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు (నాగన్న బాబు), ధర్మకర్తలు లెక్కింపును పర్యవేక్షించారు.

నేడు జిల్లావ్యాప్తంగా సామూహిక శ్రమదానం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆరోగ్య సమాజం నిర్మాణం కోసం కలిసికట్టుగా ముందడుగు వేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి గంట పాటు సామూహిక శ్రమదానం కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయి అధికారులంతా పాల్గొనాలని, ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. స్వయం సహాయక బృందాలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, మార్కెట్ అసోసియేషన్లు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఆరోగ్య సురక్ష.. అందరికీ రక్ష

ప్రజారోగ్యమే పరమావధి

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలు
- తొలిరోజు 51 క్యాంపుల నిర్వహణ
- 19,491 మందికి ఓపీ సేవలు
- 288 మంది వైద్యుల పర్యవేక్షణ
- ప్రజాప్రతినిధుల హాజరు



తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు



తణుకు అర్బన్: తణుకులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అందరికీ ఆరోగ్యం.. అందరికీ సంక్షేమం.. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష. దీనికి అనుగుణంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాల నిర్వహణ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు వైద్యశిబిరాల్లో పాల్గొని ప్రజలకు అందుతున్న వైద్యసేవలను ప్రత్యక్షంగా పరిశీలించి వైద్యుల సేవలు కొనియాడారు. రెండు జిల్లాల్లో తొలిరోజు 51 వైద్యశిబిరాలను నిర్వహించగా 19,491 మందికి ఓపీ నమోదు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే రెండు జిల్లాల్లో కలిపి 594 మందికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఉన్న రిఫరల్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. మొత్తంగా 288 మంది వైద్యులు సేవలు అందించారు. తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

'పశ్చిమ'లో 26 క్యాంపులు

పశ్చిమగోదావరి జిల్లాలో 26 మెడికల్ క్యాంపులు నిర్వహించారు. గ్రామాల్లో 20, పట్టణాల్లో ఆరు శిబిరాలు ఏర్పాటుచేయగా మొత్తంగా 13,132 ఓపీ కేసులు నమోదయ్యాయి. వీరిలో పురుషులు 5,234 మంది, మహిళలు 7,082 మంది, చిన్నపిల్లలు 816 మంది, బాలింతలు 312 మంది సేవలు పొందారు. వైద్య పరీక్షల అనంతరం 412 మందిని ఉన్నత వైద్యానికి రిఫర్ చేశారు. 68 మంది స్పెషలిస్టు వైద్యులు, 52 మంది పీహెచ్‌సీ వైద్యులు సేవలందించారు.

ప్రజాప్రతినిధుల మమేకం

- తాడేపల్లిగూడెం నియోజకవర్గం తాడేపల్లిగూడెం లోని 1 నుంచి 7వ వార్డు వరకు వీకర్స్ కాలనీలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మెడికల్ క్యాంపును ప్రారంభించారు.
- తణుకు నియోజకవర్గం తణుకులోని ఉమెన్స్ కాలేజీలో, తణుకు మండలం దువ్వలో, అత్తిలి మండలం అత్తిలిలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మెడికల్ క్యాంపులు ప్రారంభించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

	ఏలూరు జిల్లా	పశ్చిమగోదావరి జిల్లా
క్యాంపులు	25	26
ఓపీ సేవలు	6,359	13,132
ఉన్నత వైద్యానికి సిఫార్సు	182	412

- భీమవరం నియోజకవర్గం భీమవరంలో పీఎస్ఎన్ గరల్స్ హైస్కూల్లో, తాడేరులో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. భీమవరంలో కలెక్టర్ పి.ప్రశాంతి మెడికల్ క్యాంపును పరిశీలించారు.
- ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర మండలం ఇలపర్రు, ఆచంట మండలం ఆచంట, పెనుమంట్ర మండలం నెగ్గిపూడి, పోడూరు మండలం పోడూరులో వైద్య శిబిరాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు.
- నరసాపురం నియోజకవర్గం నరసాపురం లెనిన్ హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు.
- పాలకొల్లు నియోజకవర్గం పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడాల గోపీ హెల్త్ క్యాంపులను ప్రారంభించారు.
- ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు మండలం చినకాపవరం, ఉండి మండలం చిలుకూరు, కాళ్లలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రారంభించారు.

ఏలూరులో 25 గ్రామాల్లో.. ఏలూరు జిల్లాలో 25 గ్రామాల్లో ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించి 6,359 మందికి సేవలు అందించారు. వీరిలో 2,717 మంది పురుషులు, 3,642 మంది మహిళలు ఉన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 182 మందికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. అత్యధికంగా దెందులూరు మండలంలో 460 ఓపీ నమోదయ్యింది.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



భీమవరంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్న ఆరోగ్య సురక్ష పేద కుటుంబాలకు వరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం స్థానిక పొట్టి శ్రీరాములు బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలో ఏర్పాట్లు, వైద్యసేవలను ఆమె పరిశీలించారు. రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్ల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈసీజీతో సహా మొత్తం 14 రకాల పరీక్షలను నిర్వహించి, 105 రకాల మందులను ఉచితంగా అందిస్తామన్నారు. దీర్ఘకాలంగా షుగరు, బీపీతో బాధపడుతున్న వారిని ప్రత్యేక చికిత్సకి రిఫర్ చేయాలని సూచించారు. కంటి పరీక్షలను నిర్వహించి కళ్లజోళ్లు అందిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, అదనపు డీఎంహెచ్ఓ బి.భానునాయక్, జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కీర్తి కిరణ్, తహసీల్దార్ వై.రవికుమార్, రెడ్‌క్రాస్ సంఘం అధ్యక్షుడు రామభద్రి రాజు ఉన్నారు.

గణపవరంలో..

గణపవరం సచివాలయం–2లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు.



నరసాపురం: నరసాపురంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పెనుగొండ: ఆచంటలో పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



భీమవరం అర్బన్: తాడేరులో రోగుల రిపోర్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఉండి: చిలుకూరులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



యలమంచిలి: కొంతేరులో శిబిరంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపీ

'కాఫీ విత్ క్లాప్ మిత్ర'తో ప్రోత్సాహం



గణపవరంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగుతున్న కలెక్టర్ ప్రశాంతి

గణపవరం: ఆరోగ్య సమాజాన్ని స్థాపించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎనలేనిదని, కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమం ద్వారా వారికి సముచిత గౌరవం కల్పిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం గణపవరంలోని చెత్త సంపద కేంద్రం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలసి కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమంలో భాగంగా వారితో కలిసి ఆమె కాఫీ తాగారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా డస్ట్‌బిన్‌లు అందజేశామని, వీటిని సక్రమంగా వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు శాలువా కప్పి సన్మానించి, మెమెంటోలు, యూనిఫాం, చేతి గ్లౌజులు, మాస్కులు వంటి వాటితో కూడిన కిట్లు అందజేశారు. రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి, వైస్ ఎంపీపీ సలాది రత్నకుమారి, సర్పంచ్ మూర అలంకారం, డీపీఓ జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పోటీ పరీక్షల నిర్వహణ



అధికారులకు సూచనలిస్తున్న డీఆర్వో కృష్ణవేణి

సాక్షి, భీమవరం: ఏపీపీఎస్సీ ఉద్యోగ పోటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో కె.కృష్ణవేణి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మూడు కేంద్రాల్లో 777 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. భీమవరం డీఎన్ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలల్లో ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 3వ తేదీ ఉదయం 361 మంది, 4న ఉదయం 90 మంది, మధ్యాహ్నం 90 మంది, 6న ఉదయం 118 మంది, మధ్యాహ్నం 118 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. అభ్యర్థుల హాల్‌టికెట్, గుర్తింపు కార్డులను పరిశీలించి కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు ఎస్.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ రాజీవ్, విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్, భీమవరం డిపో మేనేజర్ ఎస్.గిరిధర్‌కుమార్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, పోలీసు, విద్యుత్, హెల్త్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు. చిత్రంలో ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు, కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: సార్వా ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా నిర్వహించి, రైతులకు త్వరితగతిన నగదు జమ చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి, నీటిపారుదల సలహా మండలి సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు నిరంతరం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. అధికారులు ముందస్తు ప్రణాళికతో సార్వా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో గోనె సంచుల కొరత లేదని, ధాన్యం సేకరించిన నాలుగైదు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తామన్నారు. త్వరలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై నీటిపారుదల పనులపై సమీక్షిస్తామన్నారు. దాళ్వా పంటకు సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 56 శాతం వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా పంట సాగుకు నీటి ఇబ్బందులు లేవన్నారు. గత దాళ్వాలో సమష్టిగా ధాన్యం కొనుగోలును విజయవంతం చేశామని, ఇదే స్ఫూర్తితో సార్వాలో పనిచేస్తామన్నారు. ఈనెల మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు), జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సభ్యులు కొట్టి కుటుంబరావు, పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీలో స్థానం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి (ప్రకాశం జిల్లా)ని నియమించారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏలూరు జిల్లాకు చెందిన డాక్టర్ తోట విజయలక్ష్మి ప్రసన్నకుమార్ (బాజీ), గోగులమూడి రత్నరాజేష్, డాక్టర్ వల్లపు సత్యవేదం కార్యదర్శులుగా, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన డాక్టర్ ఎర్రంశెట్టి వినయ్‌కుమార్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు.

పక్కాగా ఆహార ఉత్పత్తుల పంపిణీ

కలెక్టర్ ప్రశాంతి



సాక్షి, భీమవరం: ఆహార ఉత్పత్తులు సక్రమంగా పేదలకు అందేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. పోషకాహార కిట్ల పంపిణీలో లోటుపాట్లను కమిటీ సభ్యులు పరిశీలించి రాతపూర్వంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరాలో లోటుపాట్లను కూడా పర్యవేక్షించాలన్నారు. కొందరు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇంటింటికీ బియ్యం సరఫరాలో నిబంధనలు పాటించడం లేదని, గ్యాస్ సరఫరా విషయంలోనూ డెలివరీ బాయ్స్ అదనంగా సొమ్ములు వసూలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మాల్స్, హోటళ్లలో పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఆహార కల్తీలు జరగకుండా చూడాలన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సుజాతరాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్పరాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి గణపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేరస్తులకు త్వరితగతిన శిక్ష పడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్, చిత్రంలో ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: రౌడీ షీటర్లపై కేసుల్లో విచారణ వేగవంతం చేసి స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా త్వరితగతిన శిక్ష పడే విధంగా చూడాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. భీమవరంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రౌడీషీటర్లపై ఉన్న కేసులు గురించి సమీక్ష నిర్వహించి తీవ్ర నేరాల్లో ఉన్న రౌడీషీటర్ల కేసుల్లో విచారణ, దర్యాప్తు వివరాలు తెలుసుకున్నారు. ఆయా కేసులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కోర్టులో వెంటనే విచారణ చేయించి తగిన శిక్ష పడేలా చూడాలన్నారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని కొట్లాట కేసులు, రోడ్డు ప్రమాదాలు తగ్గినందున ఇదే స్ఫూర్తితో పని చేయాలని డీఐజీ ఆదేశించారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 21న ప్రత్యే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్‌లో శనివారం నిర్వహించిన ప్యానల్ లాయర్లు, పారా వలంటీర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

బాబు హయాంలో.. కంచాలు కొడితే కేసులు

- కాపు ఉద్యమంలో కంచాలు మోగించిన వారిపై ఉక్కుపాదం
- జైల్లోని బాబు కోసం నేడు ప్రజాశబ్దం పిలుపుపై విమర్శలు



నాడు కాపు ఉద్యమంలో భాగంగా అమలాపురంలో కంచాలు కొడుతున్న కాపు నేతలు (ఫైల్‌ఫొటో)

సాక్షి ప్రతినిధి, కాకినాడ/ఏలూరు టౌన్: 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు' అన్నట్లుగా తెలుగుదేశం నేతలు వ్యవహరిస్తున్నారు. వందల కోట్ల రూపాయల స్కిల్ స్కాంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో టీడీపీ అధినేత చంద్రబాబు 21 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైలుపాలైన చంద్రబాబుకు సంఘీభావంగా ప్రజలంతా కంచాలు కొడుతూ ప్రజాశబ్దం వినిపించాలంటూ లోకేశ్ ఇచ్చిన పిలుపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఐదు నిమిషాలు పాటు కంచాలు, గరిటెలు, వాహనాల హారన్లు, అవేవీ అందుబాటులో లేకపోతే విజిల్స్‌తోనైనా ప్రజాశబ్దం చేయాలని లోకేశ్ చేసిన ట్వీట్ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో మరోలా ప్రవర్తించడం టీడీపీ నేతలకు పరిపాటని పరిశీలకులు ఎద్దేవా చేస్తున్నారు. నాడు కాపు ఉద్యమంలో భాగంగా కంచాలపై శబ్దాలు చేస్తేనే అక్రమ కేసులు పెట్టారని.. ఇప్పుడు అవినీతితో జైలుపాలైన చంద్రబాబుకు మద్దతుగా కంచాలు, ప్లేటులతో ప్రజా శబ్దం చేయమని లోకేష్ ట్వీట్ చేయడం సిగ్గు చేటని ఆక్షేపిస్తున్నారు. అప్పుడు కాపు సామాజికవర్గం న్యాయమైన డిమాండ్ కోసం నిరసన తెలిపితే అక్రమ కేసులతో వేధించి ఇప్పుడు అదే పద్ధతిలో చంద్రబాబుకు సంఘీభావం తెలియచేయమనడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమంటున్నారు.

లోకేశ్ ట్వీట్‌పై విమర్శలు

తమ పార్టీ అధినేత కటకటాలపాలై దిక్కుతోచక తెలుగు తమ్ముళ్లు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ జనరంజక పాలనతో గోదావరి జిల్లాల్లో ఉనికి కోసం టీడీపీ తంటాలుపడుతోంది. 21 రోజులుగా చంద్రబాబు జైలులో ఉన్నా గోదావరి జిల్లాల్లోని ప్రజల సంగతి అటుంచితే పార్టీ నేతల కనీస స్పందన కూడా కొరవడిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గగ్గోలు పెట్టడం బహిరంగ రహస్యమే. బాబుకు మద్దతు అన్నట్టు లోకేష్ చేసిన ట్వీట్‌పై పార్టీ శ్రేణులే పెదవి విరుస్తున్నాయి.

కాపు ఉద్యమంపై దమనకాండ

2016లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కాపు ఉద్యమం ప్రధానంగా తూర్పు గోదావరి జిల్లాలో ఉధృతంగా సాగింది. ఆ క్రమంలో జనవరి 31న తుని సంఘటన చోటుచేసుకుంది. ఆనాటి సర్కారే తెరవెనుక నడిపిన మంత్రాంగం వల్లే సంఘటన చోటుచేసుకుందనే ఆరోపణలు అప్పట్లోనే వినిపించాయి. ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సహా ఆ కుటుంబంలోని మహిళలని కూడా చూడకుండా టీడీపీ సర్కార్ దమనకాండకు పాల్పడింది. దీనిపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాపు సామాజిక వర్గీయులు శాంతియుత పంథాలో బాబు ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన వ్యక్తంచేశారు. పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, జగ్గంపేట, కిర్లంపూడి, పి.గన్నవరం, అంబాజీపేట, కొత్తపేట, రాజోలు, మామిడికుదురు, ముమ్మిడివరం తదితర మండలాల్లో ఇళ్ల వద్దనే కంచాలు, పళ్లాలు, ప్లేటులను గరిటెలతో దరువు వేస్తూ 'కాపుల ఆకలి కేకలు' అంటూ నినదించారు. శాంతియుతంగా ఇళ్లవద్ద, రోడ్డుకు ఇరువైపులా కూర్చుని కంచాలపై దరువువేసిన వారిపై కేసులు బనాయించారు. మహిళలు, చిన్నారులు అని కూడా చూడకుండా అందరిపైనా సెక్షన్ 341 కింద కేసులు పెట్టారు. రోడ్డుపైకి వచ్చి రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించారంటూ పలు మండలాల్లో సుమారు 400 కేసులు మోపగా అందులో ఒక్క అమలాపురంలోనే 80 నుంచి 100 వరకు ఉండటం గమనార్హం.

కేసులు ఎత్తేసిన సీఎం వైఎస్ జగన్

ప్రతి మండలంలోనూ కాపు వర్గీయులపై అక్రమంగా కేసులు పెట్టి వేధించారు. ఈ కేసుల ప్రహసనం 2016 జనవరి నుంచి 2017 మార్చి వరకు కొనసాగింది. అక్రమ కేసులు ఎత్తేయాలని సామాజికవర్గ నేతలు, యువత వేడుకున్నా చంద్రబాబు సర్కారు మనసు కరగలేదు. చివరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దమనసు చాటుకున్నారు. కాపు ఉద్యమ సందర్భంలో పెట్టిన అక్రమ కేసులన్నింటిని ఎత్తేశారు.

ఉమ్మడి పశ్చిమలో కాపులపై కేసులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కాపు ఉద్యమంపై చంద్రబాబు సర్కారు ఉక్కుపాదం మోపింది. కాపులు శాంతియుతంగా కంచాలను గరిటెలతో కొట్టి తమ నిరసన తెలిపారు. ర్యాలీలు చేస్తే సెక్షన్ 341 కింద అనేక మందిపై కేసులు నమోదు చేశారు. ఉమ్మడి పశ్చిమలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో కాపులు నిరసన తెలిపితే కేసులు నమోదు చేశారు. సుమారుగా 250 మందికి పైగా కాపులపై ఆనాడు కేసులు పెట్టారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీతారాంపురంలో క్షీరాభిషేకం చేస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న తదితరులు

నరసాపురం రూరల్: బేడ, బుడగజంగం కులస్తులను ఎస్సీలుగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపడంపై ఆ కులస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కీర్తిస్తూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశీస్సులతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున.. బేడ బుడగ జంగం కులస్తులను ఎస్సీలుగా గుర్తించాలని శాసనసభలో తీర్మానం ప్రవేశ పెట్టారన్నారు. అప్పట్లో తెలుగుదేశం అధికారంలో ఉండగా తూతూ మంత్రంగా అమరావతిలో సభా కార్యక్రమం నిర్వహించి మోసం చేశారని పెంద్ర వీరన్న విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం బేడ బుడగజంగం కులస్తుల సమస్యలను తెలుసుకుని వారికి ఆదుకోవడం కోసం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపారన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బేడ బుడగజంగం కులస్తులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ పెద్దలు కుమారి వెంకన్న, కస్తూరి మస్తాన్, ఆముదాల రమణ, కందుకూరి నాచారమ్మ, లక్ష్మి, గ్రామ సర్పంచ్ దొండపాటి వెంకట్, ఎస్సీ నాయకులు వంగలపూడి యేషయ్య, పెద్దలు నల్లి జెవిఆర్, తమ్మిశెట్టి కస్తూరి రంగ, పులపర్తి ప్రతాప్, అయ్యప్పనాయుడు, కొల్లాబత్తుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్ డీపేట గ్రామంలో ఈ నెల 28న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలవరం ఎస్సై ఎస్ ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. కుటుంబ గొడవల నేపథ్యంలో అడ్డు వెళ్లిన వ్యక్తిని గొడ్డలితో దాడి చేసిన ఇళ్ల వీరబాబు అనే వ్యక్తిని అరెస్టు చేసి జంగారెడ్డిగూడెంలో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

● గడపగడపకు సంక్షేమం



పెంటపాడు : మండలంలోని విప్పర్రులో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



మార్టేరులో బాస్కెట్‌బాల్ పోటీల దృశ్యం

పెనుమంట్ర: మార్టేరులోని శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. లీగ్ పోటీలలో పురుషుల విభాగంలో నెల్లూరుపై పశ్చిమ గోదావరి 41-14 పాయింట్లుతో విజయం సాధించింది. కడపపై గుంటూరు 29-19, ప్రకాశంపై అనంతపురం 42-14, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి 55-22, కడపపై వైజాగ్ 57-21, ప్రకాశంపై చిత్తూరు 67-22, నెల్లూరుపై కృష్ణాజిల్లా 47-22 పాయింట్లతో విజయం సాధించాయి. మహిళా విభాగంలో శ్రీకాకుళంపై పశ్చిమ గోదావరి జట్టు 27-07 పాయింట్లతో విజయం సాధించగా, ప్రకాశంపై వైజాగ్ 28-02, కడపపై తూర్పుగోదావరి 54-08, విజయనగరంపై వైజాగ్ 39-07, కర్నూలుపై శ్రీకాకుళం 16-11, కడపపై చిత్తూరు 55-00, ప్రకాశంపై కృష్ణాజిల్లా 31-04, గుంటూరుపై అనంతపురం 42-22, వైజాగ్‌పై కృష్ణా 48-32, కర్నూలుపై పశ్చిమగోదావరి 49-02 పాయింట్ల తేడాతో విజయం సాధించారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే ఊరుకోం



స్థానిక నగర పంచాయతీలో మెప్మా సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా మెప్మా పీడీ బీ.ఇమ్మానుయేలు

ఆకివీడు: డ్వాక్రా గ్రూపుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తే సహించేది లేదని, ఆయా బ్యాంకుల నుంచి గ్రూపులు ఇతర బ్యాంకులకు షిఫ్టు అవ్వాలని ఉమ్మడి జిల్లా మెప్మా పీడీ బీ ఇమ్మానియేలు చెప్పారు. స్థానిక నగర పంచాయతీ సమావేశపు హాలులో శనివారం ఆర్పీలు, మెప్మా కమిటీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్తగా ఏర్పడిన ఆకివీడు మెప్మాలోని ఆర్పీలకు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ జీతాల బిల్లులు ప్రభుత్వానికి పంపామని, అక్టోబర్ నెలలో ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. సమావేశంలో మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, డీసీఓ జగదీష్, ఏసీఓ రజనీకాంత్, పట్టణ మెప్మా అధికారి అనిల్, ఆర్పీ సంఘ ప్రతినిధి విజయకుమారి, ఆర్పీలు పాల్గొన్నారు.

ఏఓ కార్యాలయంలో అగ్నిప్రమాదం



ఎన్నార్పీ అగ్రహారంలోని అగ్నిప్రమాదానికి గురైన మండల వ్యవసాయాధికారి కార్యాలయం

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించింది. మండల వ్యవసాయాధికారి బీ సంధ్య ఇతర సిబ్బంది వివిధ పనులపై క్షేత్రస్థాయికి వెళ్ళడంతో కార్యాలయానికి తాళాలు వేశారు. మధ్యాహ్నం సమయంలో గ్రామ రైతు భరోసా కేంద్రానికి చెందిన అధికారి శ్రీనివాస్ కార్యాలయానికి రావడంతో లోపలి నుంచి పొగ రావడాన్ని గమనించిన అతను ఏఓకు ఇతర అధికారులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం స్థానిక రైతుల సహకారంతో తాళాలు తీసిలోపలికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పులపాకుల రాజశేఖర్ (32) శనివారం ద్విచక్ర వాహనంపై పొలం వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు, బంధువులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు రాజశేఖర్‌కి భార్య నాగవల్లి, ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు.

ఏలూరులో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

ఏలూరు రూరల్: ఏలూరులో ఆదివారం ఏపీ షాటోఖాన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నామని పోటీల నిర్వాహకుడు, ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎం.ఇబ్రహీం భేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టొబాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో జరిగే ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కరాటే సాధకులు తరలిరానున్నారని పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మహిళా పోలీస్ మౌనిక రాణి

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లి సచివాలయం మహిళా పోలీస్ ఆర్.మౌనిక రాణి మతిస్థిమితం సరిగ్గా లేక ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని శనివారం అతని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాల ప్రకారం.. ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెంకు చెందిన చింతా అర్జునరావు, కుమారి దంపతుల కుమారుడు గణేష్ మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. ఇంటి నుంచి తప్పిపోయిన గణేష్ శుక్రవారం రాత్రి మద్దులగూడెంకు చేరుకున్నాడు. మహిళా పోలీస్ మౌనిక రాణి అతడిని సంరక్షించి, ఆచూకీ కోసం విచారణ చేపట్టారు. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, చైల్డ్ హెల్ప్ లైన్ అధికారి సూర్య చక్రవేణిల సాయంతో గణేష్ వివరాలు సేకరించారు. అనంతరం బాలుడు గణేష్‌ను గ్రామ సర్పంచ్ చెలికాని ప్రవీణ్, వలంటీర్ అనిల్, అంగన్‌వాడీ కార్యకర్త రామలక్ష్మి సమక్షంలో వారి తల్లిదండ్రులకు మౌనిక రాణిని అప్పగించారు.

సీసీ కెమెరాల సాయంతో సొత్తు స్వాధీనం

నూజివీడు : సీసీ కెమేరాల సాయంతో పోలీసులు పోయిన సొమ్మును స్వాధీనం చేసుకొని బాధితురాలికి అప్పగించారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెంకు చెందిన గుర్రం రాములమ్మ సరుకులు కొనుగోలుకు సెప్టెంబరు 28న ఆగిరిపల్లి వచ్చింది. సరుకుల దుకాణం వద్ద పర్సు మరిచిపోయింది. తిరిగి వెళ్లి చూడగా పర్సుతో పాటు అందులో ఉన్న రూ.14 వేల నగదు పోయిందని గ్రహించి ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నంబూరు చంటిబాబు వెంటనే స్పందించి కానిస్టేబుల్ అశోక్ సాయంతో సీసీ కెమేరాల పుటేజీని పరిశీలించారు. దినసరి కూలీ డబ్బు తీసినట్లు తేలింది. అతనిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి అతని నుంచి రూ.14 వేలు నగదును రాములమ్మకు శనివారం ఇప్పించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, ఏలూరు జిల్లా, ఏలూరు
ఇ.-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
ఏలూరు జిల్లాలో ఇన్డోర్ స్టేడియం నందు గల Shuttle కోర్ట్ డెవలప్‌మెంట్ కొరకు ప్రథమ పిలుపుగా అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫార్మ్ ద్వారా షార్ట్ టెండర్లు కోరబడుచున్నవి. సమాచారము కొరకు తేదీ.03-10-2023 ఉ.11.00గం. నుండి www.e-procurement.gov.in సందర్శించగలరు.
డివిజన్ హెడ్ హౌసింగ్
ఏలూరు డివిజన్

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయము, ఏలూరు జిల్లా, ఏలూరు
రొంతి సంఖ్య/294/DEMO/2023 తేది: 30.09.2023
జగనన్న సురక్ష కార్యక్రమములో భాగంగా వైద్య మరియు ఆరోగ్య శిబిరములు గ్రామములలో ఏర్పాటు చేయబడినవి. శ్రీయుత జిల్లా కలెక్టరు మరియు మెజిస్ట్రేటు, ఏలూరు వారి ఆదేశముల మేరకు ఇందుకు అవసరమైన బ్యాగులు మరియు ఫోల్డర్స్ సరఫరా చేయుటకు షార్ట్ టెండర్లు పిలువబడుచున్నవి. షార్ట్ టెండర్ కు ఆఖరు తేది.01.10.2023 సాయంత్రం 5.00 గంటల లోపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయము నందు సమర్పించవలసినదిగా కోరడమైనది. వివరములు, షరతులు కొరకు కార్యాలయం పనివేళలలో సంప్రదించగలరు. www.westgodavari.ap.gov.in
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, ఏలూరు జిల్లా, ఏలూరు

క్లుప్తంగా

పౌరులంతా విద్యావంతులు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాకబ్‌బాబు

తణుకు అర్బన్: పౌరులంతా విద్యావంతులైతే రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడవచ్చని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎస్వీ జాకబ్ బాబు అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక 12వ వార్డు మల్లికాసుల పేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, ఆర్‌ఐ భవాని, సచివాలయ సెక్రటరీ ఎం.సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు యాతం బూరయ్యను పరామర్శిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు యాతం బూరయ్య తండ్రి వెంకన్న ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా శనివారం రాత్రి వెంకన్న కుటుంబాన్ని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. వెంకన్న మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత వెంకన్న చిత్రపటం వద్ద డిప్యూటీ సీఎం ×కొట్టు× నివాళులర్పించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తోట యువరాజు కుటుంబాన్ని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ముప్పిడి సంపత్‌కుమార్, ఉప సర్పంచ్ గట్టిం సాంబయ్య ఉన్నారు.

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్



తణుకు కోర్టు ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పౌరులంతా కృషి చేయాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టు ప్రాంగణంలో శనివారం స్వచ్ఛభారత్ పురస్కరించుకుని ఆవరణ అంతా శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి పి.సాయిరామ్, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్, స్పెషల్ మేజిస్ట్రేట్ పీఎస్‌పీ చిరంజీవిరావు, న్యాయవాదులుపాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణ కోర్టు ఆవరణలోని పరిసరాలలో చెత్త చెదారాలను, అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పర్యవేక్షణలో జడ్జిలు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొని పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్ శ్రీ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.అన్నామణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



దువ్వలో ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను సందర్శిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని 1వ సచివాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల తయారీ, ప్రీ స్కూల్ పిల్లల విద్యా బోధనకు సంబంధించిన వివిధ ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని బాలింత మహిళలు, గర్భిణులు తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మి, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీపీ రుద్ర ధనరాజు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

- ప్రజారోగ్య పరిరక్షణలో కీలకపాత్ర వహించండి: మంత్రి కొట్టు సత్యనారాయణ
- ప్రజారోగ్యాన్ని కాపాడటమే వైఎస్సార్ సీపీ లక్ష్యం: మంత్రి కారుమూరి



తాడేపల్లిగూడెం:జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



దువ్వ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వం బాధ్యతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక 2వవార్డులోని యర్రా నారాయణస్వామి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం మంత్రి కొట్టు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షకార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 2.50 లక్షల మందికి వైద్య ఆరోగ్య సేవలు అందిస్తారన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో మధుమేహం, బిపి, హిమోగ్లోబిన్, డెంగ్యూ, మలేరియా, శరీర ఉష్ణోగ్రత తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్లను అమలు చేసిన ఘనత జగనకే దక్కుతుందన్నారు. బిసి వర్గాలకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి 130 ఉపకులాలను గుర్తించారన్నారు. గత తెదేపా ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు దోపిడికే ప్రాధాన్యత అన్నట్లుగా పాలన సాగించాన్నారు. రైతు రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలకు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సంక్షేమ పాలన కొనసాగేలా ప్రజలు వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ, జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి, నాయకులు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, బోళెం రామలక్ష్మి, కొట్టు విశాల్, మేడపాటి చల్లారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష

తణుకు అర్బన్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటికి హెల్త్ విభాగం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకుని వైద్యసేవలు అందిస్తున్నారని అన్నారు. ఇప్పటికే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 2వేలకు పైగా వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారని స్పష్టం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



తాడేపల్లిగూడెం అర్బన్ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం..

ఆరోగ్యమే మహాభాగ్యమనే సిద్ధాంతాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ప్రతి ఇంటి గుమ్మంలోకి వచ్చే ఆరోగ్య సిబ్బందికి సహకరించి ప్రజానీకమంతా వ్యాధుల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, మునిసిపల్ కార్యాలయ అధికారులు, ఐఎంఏ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను పంచాయతీ కార్యాలయం వద్ద రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజల వద్దకే కార్పొరేట్ వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు మండలం దువ్వ గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నది జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, తహసిల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్ గోపాల కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పెంటపాడులో: దర్శిపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

అత్తిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలులో సిబ్బంది ఎటువంటి నిర్లిప్తత లేకుండా వ్యవహరించాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం అత్తిలి ఎంపీయూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ శిబిరాన్ని ఆయన సందర్శించారు. క్యాంపులో వైద్యసేవలు పొందుతున్నవారిని పలకరిస్తూ వారికి చేస్తున్న పరీక్షలు, వైద్యసేవలపై ఆరా తీసారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి అవసరమైన వైద్య సహాయం అందించడమే జగనన్న ఆరోగ్యసురక్ష లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, రంభ సుజాత, కంకటాల సతీష్, వైద్యులు ఆర్ దివ్య, సాయిబాల, పి కిరణ్, ఆర్ సురేఖ, కె నాగరాజు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో ఎండీ అమీలుజమా తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యం...సీఎం జగన్ లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్: అందరి ఆరోగ్యం...సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు అన్నారు. శనివారం మండలంలోని ఆరుగొలను పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నార్ని శంకరరావు, సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, పంచాయతీ ఈవో సీహెచ్.శ్రీనివాసచంద్రరాజు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష– పేదలకు రక్ష

పెంటపాడు: ముఖ్యమంత్రి పేదల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష పేదలకు రక్ష అని మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం తొలిరోజు దర్శిపర్రు ఎంపీపీ స్కూల్ వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో పార్టీ నాయకులు గుండుమోగుల సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మండల వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, మైలవరపు పెదబాబు, గుండమోగుల మునీంద్ర, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, ఎంపీటీసీ సభ్యులు తోట నీరీక్షణరావు తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, గ్రామ కార్యదర్శి రామారావు, ఐసీడీఎస్ అధికారులు, పెంటపాడు, ముదునూరు ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలు మేలు

ఇరగవరం: రాష్ట్రంలో వంద శాతం ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారులు వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఇరగవరం మండలం కాకిలేరు గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, సర్పంచ్ ఉన్నమట్ల నాగమణి, ఎంపీటీసీ జవ్వాది ఫణీబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఏపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, నాయకులు జవ్వాది రామోజీ, కె కిషోర్, బాబులు, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ
- పడమరవిప్పర్రులో గడపగడపకుమన ప్రభుత్వం

పెంటపాడు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. గడపగడపకుమన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెంటపాడు మండలం పడమరవిప్పర్రు గ్రామంలో శనివారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ తెదేపా హాయాంలో చంద్రబాబు భారీ కుంబకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. తెదేపా నేతలు న్యాయస్థానాన్ని, కోర్టులను కూడా గౌరవించకుండా ప్రవర్తించడం అవివేకమన్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు దోపిడీకి పాల్పడితే నేడు జగనన్న కొన్ని లక్షల కోట్లు రూపాయలు ప్రజలందరికీ పథకాల పేరిట పంచుతున్నాడన్నారు. ఈ తేడాను ప్రజలు గమనించాలన్నారు. యువనేత కొట్టు విశాల్, మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, పార్టీ నాయకులు కోసూరి చంటిరాజు, విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం సభ్యు లు కోసూరి వెంకట్రాజు, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కళిరెడ్డి నాగేశ్వరరావు (అబ్బాయి), ఎంపీటీసీ సభ్యురాలు యండ సరస్వతి, బోణం వీరయ్య, పార్టీ నాయకులు పసల చంటి, కోసూరి సుబ్బరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, సగర్ల కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య, యండ అప్పారావు, ఇందుకూరి సత్తిరాజు, నంగిరెడ్డి రామకృష్ణ, సీహెచ్ శ్యాం. జి. చంద్రశేఖర్, ఎంపీపీ దాసరి హైమావతి, ముప్పిడి సంపత్ కుమార్, కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విప్పర్రు గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

తణుకు టౌన్: విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్‌కు చేరుకుంటారని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి చెప్పారు. శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 19 జిల్లా జట్టుకు ఎంపిక పోటీల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపోటీలకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలకు చెందిన అండర్ 19 విద్యార్థినులకు యోగా, చదరంగం, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించి జిల్లా స్కూల్ గేమ్స్ జట్లను ఎంపిక చేస్తారని ప్రిన్సిపాల్ భూపతిరాజు హిమబిందు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, వీజీఎస్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనా సాయి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే జయరాజు, జీఎంఎస్ కుమార్, కళాశాల పీడీలు ఎం శ్రీనివాస్, ఎం రత్నకుమారి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



తణుకు మహిళా కళాశాలలో మాట్లాడుతున్న చిట్టూరి సత్య ఉషారాణి

మాజీ ఎంపీ చిట్టూరి సుబ్బారావు ఆదర్శనీయుడు

తణుకు అర్బన్: తణుకు వాసుల అభిమాన నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు చిట్టూరి సుబ్బారావు చౌదరి ఆదర్శనీయుడని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చిట్టూరి సుబ్బారావు చౌదరి 105వ జయంతి సందర్భంగా ఆయన మనుమడు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి స్ఫూర్తిదాయకమైన రాజకీయం చేసిన వ్యక్తిగా సుబ్బారావు చౌదరి అన్ని వర్గాల మన్ననలు పొందారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, వి.సీతారాం, మల్లిరెడ్డి నాగార్జున, కోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో చిట్టూరి సుబ్బారావు చౌదరి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి కారుమూరి

కర్మాగారాల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

తణుకు: తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కర్మాగారాల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రాసుగర్స్, వాన్‌బరీ, ఫ్లూటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లు తనిఖీ చేసిన అధికారులు సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ జిల్లా అధికారి ఏటీవీ రవికుమార్, ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, తణుకు ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని పంచాయతీ కార్యదర్శులు టి.రవిచంద్ర, దివ్య అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రం నెం.86, 87, 88, 89లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం స్వచ్ఛత హి సేవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘు, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.సుధారాణి, బి.వెంకటలక్ష్మి, డి.రామలక్ష్మి, కే.సునీత, వాసవి కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో...:

పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రక్తహీనత నివారణపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.తులసీరాణి, కే.గీత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, మంచి స్పర్శ – చెడు స్పర్శ గురించి వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంజికుమారి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



పెదతాడేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎటువంటి పురుగు మందులు వాడకుండా పంటలు పండించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు వస్తాయని, తద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎటువంటి పురుగు మందులు వాడకుండా పండించిన కూరగాయలు, బియ్యం , బెల్లం వంటివి అమ్మకాలు చేశారు. స్టాల్ పెట్టిన గంటలోనే కూరగాయలు, బియ్యం వంటివి అమ్మకాలు జరగడం విశేషం. ప్రకృతి వ్యవసాయం జోనల్ కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం, డివిజన్ ఇన్‌ఛార్జ్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతీ సోమవారం స్టాల్ ఏర్పాటు చేసి, విక్రయించడం జరుగుతుందన్నారు. యూనిట్ ఇన్‌ఛార్జీలు, ప్రకృత వ్యవసాయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి విధానంలో సాగు చేసిన పంటలను విక్రయిస్తున్న మహిళలు

స్వామినాథన్ మృతి తీరనిలోటు

తణుకు టౌన్: వ్యవసాయ రంగానికి స్వామినాథన్ మృతి తీరనిలోటని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం ఎంఎస్ స్వామినాథన్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ భారత దేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ వ్యవసాయ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఆహార వృద్ధిలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు విశేష కృషి చేశారని గుర్తుచేశారు. అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలను అభివృద్ధి చేయడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారని చెప్పారు.

జగనన్న గృహాలు త్వరగా పూర్తి చేయాలి



వేల్పూరులో జగనన్న కాలనీలో లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తదితరులు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని కావలిపురం రోడ్డులో గల జగనన్న కాలనీలో ఆప్షన్ 3లో ఇళ్ల నిర్మాణం చేపట్టే వారు అక్టోబరు 14 లోపు శంకుస్థాపనలు చేసి ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారుల అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆప్షన్ 3లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అవసరమైన కాంట్రాక్టర్ అందుబాటులో ఉండాలని కోరారు. గృహ నిర్మాణాల విషయంలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ నిర్మాణ శాఖ డీఈఈ ప్రసాద్, ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శి గంగాధరరావు, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.